# ఆకలి

కొంతి అంతా అక్కడ కుప్పబోసినట్లుంది.

ఫంక్షన్ ప్యాలెస్ రంగురంగుల బట్టలతో కళకళలాడిపోతోంది.

అటుగా పోతున్న అతను ఆ ఫంక్షన్ ప్యాలెస్‌లోని హడావిడికి ఆకర్షితుడై, అక్కడే నిలబడి ప్యాలస్ వైపు చూడడం సభ్యత కాదని పించిందేమో-ప్రక్కనేవున్న మిర్చిబండి వేపు వెళ్ళాడు. చేతిలోకి మిర్చి ప్లేటు చేరినా చూపులు మాత్రం ప్యాలస్ వేపే వున్నాయి. అందని ద్రాక్ష కోసం అర్రులు చాస్తున్నట్లున్నాయి అతని ఆ ఆకలిగొన్న చూపులు.

అతనికి కొద్దిగా ఇవతల చెత్తకుండీ ప్రక్కన గోడకి అనుకుని ఫుట్‌పాత్‌మీద కూలబడున్న ఓ బిచ్చగాడి చూపులు అతని మిర్చి ప్లేటులో చిక్కుకుపోయివున్నాయి. ఆ చూపుల్లోని ఆకలి అతను తిండి తిని ఎన్నాళ్ళయిందో అనిపించేట్లు చేయకమానదు ఎవరికైనా!

సరిగ్గా అప్పుడే ఓ మోటార్‌సైకిల్ దూసుకొచ్చింది ఫంక్షన్ ప్యాలెస్‌లోకి. దాని వెనుక కూర్చున్న ఆ అందాల రాసిని చూడగానే సభ్యతని కూడా మరచిపోయి, తినడాన్ని కాసేపు వాయిదా వేసి, ఆమెనే ఆకలిగా చూడసాగాడు మిర్చి తింటున్న అతను. ఆ చూపుల్లోని ఆకలి అతను ఆడగాలి తగిలితేనే ఎంతగా చలించిపోతాడో చెప్పకనే చెబుతోంది.

మోటార్‌సైకిల్ని స్టాండు వేసికూడా ముందుకు అడుగు వేయడం మరచి, ప్రక్కనే నిలబడున్న భార్య వునికిని వదలి, అవతల అగివున్న

కారు వంక ఆకలిగా చూడసాగాడు ఆ యువకుడు. ఓ పదిమంది తనని సాగనంపడానికి రాగా, డ్రయివర్ కారు తలుపులు తెరవగానే వెనక సీట్లో వెనక్కి జారగిలబడి కూర్చున్నాడు ఆ పెద్దమనిషి. ఇంకా అలానే కారుని, కారులోని పెద్దమనిషిని చూస్తున్న మోటార్ సైకిల్ యువకుని చూపుల్లో ఆకలి - జీవితంలో ఎప్పుడైనా తనాస్థితికి చేరుకోగలడా అని తపన పడుతున్నట్లు వుంది.

గేటులోంచి బయటికి దూసుకుపోతున్న కారులోని పెద్దమనిషి చూపుల్ని ఫుట్ పాత్ మీద కూర్చున్న బిచ్చగాడు ఆకర్షించాడు. 'తనకి తినడానికి ఎంతవున్నా అరిగించుకునే ఆరోగ్యం లేదు. కనీసం ఇలాంటి ఫంక్షన్లకి వచ్చినప్పుడన్నా నలుగురితోపాటు సరదాగా ఏమీ తినలేడు. అందుకే ఆ బిచ్చగాడి కళ్ళలోని ఆకలి తనని అంతగా ఆకర్షిస్తోంది' బిచ్చగాడిని చూసి ముచ్చటపడుతూ అనుకున్నాడు పెద్దమనిషి.

(స్వాతి సపరివారపత్రిక)